పాఠమే పరీక్ష..!





పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నా పూర్తికాని సిలబస్

- వేధిస్తున్న టీచర్ల కొరత
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- ప్రభుత్వ విధానాలే కారణమంటున్న విద్యావేత్తలు

కొత్తచెరువు

వైసీపీ సర్కారు విధానాలతో ప్రభుత్వ చదువులు కుంటుపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, నాడు-నేడుతో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామంటూ పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇంగ్లిష్ మీడియం, కార్పొరేట్ వసతుల సంగతి దేవుడెరుగు.. కనీసం పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నా సిలబస్ పూర్తికాలేదు. విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్నా.. ఇంకా సగం మంది విద్యార్థులకు పుస్తకాలు కూడా అందని దుస్థితి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ నెలకొంది. పాలకులు ప్రగల్భాలు పలకడమే కానీ, టీచర్ పోస్టులను కూడా భర్తీ చేయలేదు. దీంతో ఉన్న టీచర్లపై పనిభారం పడుతోంది. ఒక్కో టీచర్ వేర్వేరు సబ్జెక్టులు బోధించాల్సి వస్తుండడంతో సిలబస్ పూర్తికావడం గగనమవుతోందని ఆ వర్గాలు వాపోతున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తికావాల్సి ఉండగా.. నేటికీ పాఠాలు చెబుతూనే ఉన్నారు.

పరీక్షలు దగ్గర పడుతున్నా..

అంతర్జాతీయ స్థాయి ఐబీ సిలబస్‌ను ప్రాథమిక పాఠశాల నుంచి అందుబాటులోకి తీసుకు వస్తామని పాలకులు చెబుతున్నారు. పాఠశాలలో నేటికీ పూర్తిస్థాయిలో సబ్జెక్టు టీచర్లను నియమించలేదు. పదో తరగతి పరీక్షలకు సమయం ముంచుకొస్తోంది. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రభుత్వం షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ పాఠాలు పూర్తికాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏటా డిసెంబరు నాటికి పాఠ్యాంశాలు పూర్తి చేసి, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేవారు. ప్రస్తుత విద్యా సంవత్సరం వివిధ కారణాలతో సిలబస్ పూర్తి కాలేదు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో 70 నుంచి 80శాతం వరకు మాత్రమే పాఠ్యాంశాలు పూర్తయ్యాయి. ఇంకా 20శాతం పాఠాలు చెప్పాల్సి ఉంది. సిలబస్‌ను పూర్తి చేసేందుకు సత్యసంకల్పం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో 315 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 6 నుంచి 10వ తరగతి వరకు 85,789 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న వారు 16,611 మంది ఉన్నారు. వారు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో వెలువడిన పది ఫలితాల్లో 25వేల మంది విద్యార్థులకుగాను 16వేలు మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో జిల్లా ఫలితాల పరంగా రాష్ట్రంలో 21వ స్థానానికి పరిమితమైంది. ఇందులో జిల్లావ్యాప్తంగా గణితం, సైన్స్, హిందీ, ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టుల్లో అధికంగా ఫెయిలయ్యారు.

ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు పెద్దమొత్తంలో ఖాళీగా ఉన్నాయి. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో 182 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంగ్లిష్ 94, గణితం 13, హిందీ 34, ఫిజికల్ సైన్స్ 19, బయాలజీ 2, సోషల్ 9, తెలుగు 9, పీడీ 64, ఉర్దూ 2 టీచర్ పోస్టులు ఖాళీ. ప్రాథమిక పాఠశాలల్లో 95 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

బడుల విలీనంతో ప్రైవేటు బాట

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల విలీన ప్రక్రియ ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో కలిపారు. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 20లోపు ఉంటే ప్రభుత్వం విద్యాహక్కుచట్టం పేరుతో పాఠశాలకు ఒక టీచర్‌ను ఉంచింది. ఒక టీచర్ రెండు తరగతులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా తగ్గుతోంది. విద్యార్థులు లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని బడులు మూతపడుతున్నాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ నేతలు తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. పిల్లల జనన రేటు తగ్గుతోందంటూ పాలక పెద్దలు కొత్తభాష్యం చెబుతుండడం శోచనీయం.

టీచర్లపై పనిభారం

ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేకపోవడంతో రెండు సబ్జెక్టులను ఒక ఉపాధ్యాయుడు బోధించాల్సి వస్తోంది. దీంతో ఉపాధ్యాయులపై అదనపు భారం పడటమే కాకుండా విద్యార్థులకు సబ్జెక్టులపై నాణ్యమైన విద్య బోధించలేకపోతున్నారు. యాప్‌ల భారం, ప్రభుత్వ విధానాల కారణంగా పాఠశాలల్లో విద్య మసక బారుతోందన్న విమర్శలు లేకపోలేదు. ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేయాలనీ, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయ నేతలు పేర్కొంటున్నారు.

సత్యసాయి సంకల్పం ద్వారా పాఠ్యాంశాలను పూర్తి చేస్తున్నాం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు సత్యసాయి సకల్పం స్పెషల్ డ్రైవ్ ద్వారా పాఠ్యాంశాలను పూర్తి చేస్తున్నాం. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

- రంగస్వామి, డిప్యూటీ డీఈఓ

20 మంది తహసీల్దార్ల బదిలీ

పుట్టపర్తి, జనవరి 31: ఎన్నికల వేళ జిల్లాలో పనిచేస్తున్న 20 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణను నంద్యాల జిల్లాకు పంపారు. పుట్టపర్తి ఆర్డీఓ ఆఫీస్‌లో పనిచేస్తున్న జిలానీ, కరుణాకర్ (బుక్కపట్నం), జమానుల్లా (అగళి), వేణుగోపాల్ (రొళ్ల), సౌజన్యలక్ష్మి (పరిగి)ని వైఎస్ఆర్ జిల్లాకు బదిలీ చేశారు. రంగనాయకులు (గోరంట్ల), నాగేంద్ర (ముదిగుబ్బ), సయ్యద్ సాబుద్దీన్ (చెన్నేకొత్తపల్లి), శ్రీధర్ (తలుపుల), శ్రీలత (పెనుకొండ), సురేష్‌కుమార్ (సోమందేపల్లి), నాగరాజు (చిలమత్తూరు), మురళీకృష్ణ (గుడిబండ), సుబ్బలక్ష్మమ్మ (కదిరి ఆర్డీఓ కార్యాలయం)ను చిత్తూరుకు బదిలీ చేశారు. అనుపమ (కలెక్టరేట్), నాగరాజు (తాడిమర్రి), నటరాజ్ (కదిరి ఆర్డీఓ కార్యాలయం), ఆనందాచారి (రొద్దం), హసీనాసుల్తానా (హిందూపురం)ను కర్నూలుకు బదిలీ చేశారు.

ముగ్గురు ఆర్ఐలు కూడా..

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐ)ను బదిలీ చేస్తూ బుధవారం డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఆర్ఐ టైటాస్‌ను కడపకు, నారాయణను కర్నూలుకు, రాజశేఖర్‌రెడ్డిని తిరుపతికి బదిలీ చేశారు. కర్నూలు నుంచి రవికుమార్, తిరుపతి నుంచి చంద్రశేఖర్, అన్నమయ్య జిల్లా నుంచి మహబూబ్‌వలీ జిల్లాకు జిల్లాకు బదిలీపై రానున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

యూటీఎఫ్ డిమాండ్



ఆర్డీఓ కార్యాలయం ముందు దీక్ష చేపట్టిన యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తిరూరల్, జనవరి 31: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేసు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈఎస్ వెంకటేసు మాట్లాడుతూ.. మెరుగైన పీఆర్సీ ఇస్తామనీ, క్రమం తప్పకుండా డీఏలు చెల్లిస్తామనీ, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని హామీలు గుప్పించిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని నెరవేర్చకపోగా ఉద్యోగులు దాచుకున్న వేలకోట్ల రూపాయల సొమ్మును దారి మళ్లించిందని మండిపడ్డారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల సొమ్ము దాదాపు రూ.18096 కోట్లకు చేరిందన్నారు. బకాయిలు చెల్లిస్తామని ఆగస్టులో మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చి, నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఆర్థిక బకాయిలు చెల్లించాలనీ, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. గురువారం మడకశిర, 2న హిందూపురం, 3న కదిరి డివిజన్లలో నిరాహార దీక్షలు చేపడతామని యూటీఎఫ్ నేతలు తెలిపారు. దీక్షల్లో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

6100 పోస్టులతో డీఎస్సీ ఓ దగా..

- ఏపీటీఎఫ్ నేతల మండిపాటు

పుట్టపర్తిరూరల్, జనవరి 31: రాష్ట్రంలో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా.. 6100 పోస్టులతో డీఎస్సీ ప్రకటనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదమం తెలపడం ఓ దగా అని ఏపీటీఎఫ్ నేతలు మండిపడ్డారు. కేబినెట్ నిర్ణయాన్ని ఖండిస్తున్నామంటూ ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అన్ని ఖాళీలను ప్రకటించి, డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా నియమితులయ్యే ఉపాధ్యాయులకు రెండేళ్ల గౌరవవేతనం ఇచ్చేలా నిర్ణయం తీసుకోవడం రద్దయిన అంప్రెంటీస్‌షిప్ విధానాన్ని తిరిగి తేవడమేనన్నారు. ఎన్నో ఉద్యమాల ద్వారా అప్రెంటీస్‌షిప్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దానిని తిరిగి అమలు చేయడం సరికాదన్నారు. డీఎస్సీ ద్వారా రెగ్యులర్ నియామకాలు చేపట్టాలనీ, పూర్తి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో పోస్టు

- టీడీపీ నాయకుడిపై కేసు



బాబురెడ్డి

చిలమత్తూరు, జనవరి 31: వైసీపీ వర్గీయులపై సోషల్ మీడియాలో దూషించాడంటూ మండలంలోని హుసేన్‌పురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాబురెడ్డిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వైసీపీ నాయకులపై సోషల్ మీడియాల్లో దూషించినట్లు ఆ పార్టీ నాయకులు ఫిర్యాదు చేయడంతో బాబురెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. బాబురెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలను స్థానిక వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారన్నారు. తమ పార్టీలో చేరాలని పట్టుబట్టడం, వారు ససేమిరా అనడంతో కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుడిగా తాను కార్యకర్తలతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పానన్నారు. వైసీపీ నాయకులను ఎక్కడా దూషించలేదని చెప్పుకొచ్చారు. వైసీపీ నాయకుల ప్రస్తావనే తేలేదనీ, అయినా తాను దూషించాననంటూ వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. తాను సొంత పనిమీద బెంగళూరు వెళ్లగా.. పోలీసులు అక్కడికే వచ్చి అరెస్టు చేశారన్నారు. గతంలో వైసీపీ నాయకులు.. టీడీపీ వర్గీయులపై నానా దుర్భాషలాడినా పోలీసులు కేసులు నమోదు చేయలేదన్నారు. అధికార పార్టీ వారు ఇచ్చిన ఫిర్యాదుతో ఆగమేఘాల మీద బెంగళూరులో ఉన్న వ్యక్తిని తీసుకొచ్చి, కేసు నమోదు చేయడం ఏంటని మండిపడ్డారు.

కొనసాగిన రిలేదీక్షలు



రిలే దీక్ష చేస్తున్న డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు

పుట్టపర్తి, జనవరి 31: సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌డీఏ, వైకేపీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గణేష్ సర్కిల్ నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకు అర్ధనగ్న ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం శిబిరంలో బైఠాయించి, రిలేదీక్షలు చేపట్టారు. ఆ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకుడు రామమోహన్ మాట్లాడుతూ.. నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రిలేదీక్షలకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, బొగ్గరం శ్రీనివాసులు, మారుతి మద్దతు తెలిపారు. దీక్షల్లో పద్మావతి, హేమలత, విశాలక్ష్మి, గౌరమ్మ, నాగరాజు, శంకర్, గోపాల్, సుధాకర్, మీటేనాయక్, రవినాయక్, 32 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.


అక్రమార్కుల్లో వణుకు..!

ఇప్పటికే తహసీల్దార్, ముగ్గురు ఉద్యోగులపై వేటు

- మిగతా వారిలో దడ
- తప్పించుకునేందుకు పైరవీలు
- కలెక్టరేట్‌లోని అధికారికి ముడుపులు?



బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం



ధర్మవరం/బత్తలపల్లి, జనవరి 31: అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండ చూసుకుని రెచ్చిపోయారు. తమను అడిగేవారెవరు అన్న ధీమాతో అడ్డదిడ్డంగా అక్రమాలకు పాల్పడ్డారు. భవిష్యత్తులో పట్టుబడితే తమ పరిస్థితి ఏంటన్న స్పృహ కూడా లేకుండా చెలరేగిపోయారు. పేదల భూములను ఇష్టారాజ్యంగా వైసీపీ నాయకులకు కట్టబెట్టారు. భారీగా అవినీతి సొమ్ము పోగేసుకున్నారు. అంతా రివర్స్ అయింది. అక్రమాలపై ఉన్నతాధికారులు భారీగా ఫిర్యాదులు వెళ్లడంతో వారు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ యంత్రాంగం విచ్చలవిడితనంపై జిల్లా ఉన్నతాధికారి కన్నెర్రజేశారు. భారీఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో బత్తలపల్లి తహసీల్దార్, ధర్మవరం ఇన్‌చార్జిగా కూడా కొనసాగుతున్న యుగేశ్వరీదేవి, ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్వోలు వెంకటరామిరెడ్డి, నజీర్, వీఆర్ఏ నారాయణస్వామిపై జిల్లా కలెక్టర్ ఇటీవలే సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఈ అక్రమాల వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారో అన్న విషయంపై కూడా జిల్లా ఉన్నతాధికారులు ఆరాతీస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అడుగులకు మడుగులు ఒత్తుతూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది భారీఎత్తున అక్రమాలకు పాల్పడుతూ అనర్హులకు మేలు చేస్తూ, అర్హులకు తీవ్ర అన్యాయం చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే బత్తలపల్లి, ధర్మవరం మండలాలకు చెందిన బాధితుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారులకు భారీఎత్తున ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, స్థలాలు, మ్యూటేషన్ తదితరవాటిలో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తూ కోట్లాది రూపాయలు దండుకున్నట్లు తెలుస్తోంది. దీంతో అర్హులు భూములు కోల్పోయి ఆర్థికంగా దెబ్బతిన్నారు. అనర్హులకు భారీఎత్తున భూములు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై లోతుగా విచారణ చేపడితే ఇంకా భారీ ఎత్తున అక్రమాలు బట్టబయలయ్యే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి.

అవినీతి సాగిందిలా..

ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో రెవెన్యూ అధికారుల అవినీతి తారస్థాయికి చేరిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధి చెప్పిన వాటికల్లా తలూపుతూ పనిచేశారన్న అపవాదు మూటగట్టుకున్నారు. వివాదాస్పద భూముల విషయంలో కలుగజేసుకుని భారీఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు (అసైన్‌మెంట్) స్వాధీనంలో ఉన్నప్పటికీ వాటిని లాక్కొని, అధికార పార్టీ వారికి కట్టబెట్టారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బు చేతులు మారినట్లు తెలుస్తోంది. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా విచ్చలవిడిగా అధికారపార్టీకి ధారాదత్తం చేశారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. 600 ఎకరాలదాకా అధికార పార్టీ నాయకులకు విలువైన భూములు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. స్థలాలను కూడా అనర్హులకే పంపిణీ చేసి, భారీ మొత్తంలో డబ్బు నొక్కేసినట్లు ఆ శాఖలోనే వినిపిస్తున్నాయి. నాలుగున్నరేళ్లలో రెవెన్యూ శాఖలోని అధికారులు, సిబ్బంది కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారంటే అక్కడ ఏ స్థాయిలో అవినీతి సాగిందో అర్థం చేసుకోవచ్చు. బత్తలపల్లి ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని రోడ్డు పోరంబోకు స్థలంలో ఉన్న దాదాపు 41 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు వైసీపీ నేతలు.. అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. వీటిపై కూడా జిల్లా అధికారులు విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. జగనన్న, ఇందిరమ్మ కాలనీల్లో అధికార పార్టీ నాయకులకు విచ్చలవిడిగా పట్టాలు పంపిణీ చేసినట్లు సమాచారం. పట్టాపొందిన అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడ భారీగా క్రయవిక్రయాలు సాగిస్తుండడం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



బత్తలపల్లి ఆర్టీసీ బస్టాండు

మీరే రక్షించాలి...

భూఅక్రమాలపై జిల్లా ఉన్నతాధికారి సీరియస్‌గా ఉండడం, ఇప్పటికే నలుగురిపై సస్పెన్షన్ వేటు వేయడంతో ఆ అవినీతిలో పాలుపంచుకున్న మిగతా వారిలో భయం పట్టుకుంది. తమపై కూడా చర్యలు తీసుకుంటారేమోనన్న ఆందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎలాగైనా ఈ గండం నుంచి గట్టెక్కేందుకు అన్ని దారులూ వెతుకుతున్నారు. తమ అక్రమాలు జిల్లా ఉన్నతాధికారి దృష్టికి రానీయకుండా ఎలాగైనా రక్షించి, తమ ఉద్యోగాలు కాపాడాలని కొందరు అవినీతి వీఆర్వోలు ఇటీవల బత్తలపల్లి నుంచి కలెక్టరేట్‌కు బదిలీ అయిన ద్వితీయ శ్రేణి అధికారికి మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. అదంతా తాను చూసుకుంటాననీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, ఎవరికి ఇచ్చేది వారికి ఇచ్చేస్తే అవినీతిని అక్కడికక్కడే తొక్కి పడేయవచ్చని ఆ అధికారి భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కొందరు అవినీతికి పాల్పడ్డ వీఆర్వోలు ఆ అధికారికి పెద్దమొత్తంలో ముట్టజెప్పినట్లు సమాచారం. ఇంకా కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామనీ, తమ అక్రమాలు బయటకు రానివ్వద్దంటూ ఆ ద్వితీయశ్రేణి అధికారికి విన్నవించుకున్నట్లు ఆ శాఖ ద్వారా తెలుస్తోంది.

మతలబు ఏమిటో..?

- పట్టుకుని వదిలేయడంపై అనుమానాలు?
- వైసీపీ నాయకుడి అదుపు వెనుక ఆంతర్యం ఏమిటో?
- స్థానిక పోలీసులు సమాచారం ఇచ్చారా?
- మార్గ మధ్యంలో వదిలేశారా?



హిందూపురం, జనవరి 31: ఓ కేసులో పట్టణానికి చెందిన వ్యక్తిని ఆదోనికి తీసుకెళ్లేందుకు అక్కడి నుంచి పోలీసులు వచ్చారు. సదరు వ్యక్తి నివాస పరిధి పోలీసు స్టేషన్‌కు ఆదోని నుంచి సబ్ డివిజన్ స్థాయి అధికారి ఫోన్‌చేసి చెప్పారు. దీంతో స్థానిక పోలీసులు సహకరించి, రహమత్‌పురం ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడిని ఆదోని పోలీసులు సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తరలించారు. తరలించేటపుడు అతడి వాహనంతోపాటు డ్రైవర్‌ను కూడా పోలీసులు తీసుకెళ్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 10 గంటలకే సదరు వైసీపీ నాయకుడు హిందూపురంలో ప్రత్యక్షం కావడంతో స్థానిక పోలీసులే అవాక్కయ్యారు. సాయంత్రం ఆదోని పోలీసులు అదుపులోకి తీసుకెళ్తే.. ఎలా వచ్చాడని నివ్వెరపోయారు.

వదిలేయడంపై అనుమానాలు

ఆదోనికి చెందిన పోలీసులు ఇంత దూరం వచ్చి వైసీపీ నాయకుడిని తీసుకెళ్తున్నామని స్థానిక పోలీసులకు చెప్పి తరలిస్తూ మార్గమధ్యలో వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఆదోనికి తీసుకెళ్లి విచారించిన అనంతరం వదిలేసినా ఎవరికీ అనుమానం రాదు. మార్గమధ్యలో వదిలేయడం వెనుక ఏ మంత్రాంగం పనిచేసిందని ఇక్కడి పోలీసుల్లో చర్చ సాగుతోంది.

పెద్దాయన నుంచి ఫోన్ వెళ్లిందా?

పోలీసుల అదుపులోకి తీసుకుని తరలించిన నాయకుడు స్థానిక వైసీపీ ముఖ్యనేతకు చాలా సన్నిహితంగా మెలుగుతున్నాడు. ఇదే సందర్భంలో సదరు నాయకుడికి ఆ నేత ప్రాధాన్యత ఎక్కువగా కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు.. వైసీపీ నాయకుడిని తరలించే సమయంలో అధికార పార్టీలోని ఓ పెద్దాయన నుంచి ఫోన్ రావడంతో వదిలేసినట్లు తెలుస్తోంది. ఆదోని ప్రాంతంలో వరుస చోరీలు జరిగాయి. ఆ చోరీల్లో ఒడిశా గ్యాంగ్ పాల్గొన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. ఆ దిశగా విచారణ ప్రారంభిస్తే పట్టుబడిన నేరస్థులు చెప్పిన వివరాల మేరకు హిందూపురానికి చెందిన వైసీపీ నాయకుడు, అతడి వాహనంపై విచారణ చేయాలని తీసుకెళ్తున్నట్లు తెలిసింది. దీనిపై సోమవారం రాత్రి ఆదోని డీఎస్పీని వివరణ కోరగా.. అదుపులోకి తీసుకున్న విషయం వాస్తవమేనన్నారు. మంగళవారం ఈ విషయంపై వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఇసుక తరలింపునకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్థులు
- రీచ్ లేకున్నా ఎలా తరలిస్తారని నిలదీత



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు

హిందూపురం, జనవరి 31: పెన్నానది పరీవాహక ప్రాంతం మండలంలోని అప్పలకుంట సమీపం నుంచి ఇతర జిల్లాల నుంచి కొంత మంది టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి బుధవారం ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక ఎలా తరలిస్తారంటూ నిలదీశారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఎలా వచ్చారంటూ ప్రశ్నించారు. 2 గంటలపాటు గ్రామస్థులు అక్కడే ఆందోళన చేయడంతో అప్‌గ్రేడ్ పోలీసులు ఇసుక తరలించడానికి వచ్చిన వారిని స్టేషన్‌కు పిలిపించారు. దీనిపై డీఎస్పీ కంజాక్షన్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇతర జిల్లాకు చెందిన వారు వచ్చారన్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు అవసరం కోసం ట్రాక్టర్‌లో ఇసుక తెస్తే పోలీసులు వెళ్లి వాహనాన్ని సీజ్‌చేసి, కేసులు పెడతారు. టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చినా పోలీసులు మౌనంగా ఉండటం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్నానది నుంచి ఇసుకను తీసుకెళ్లనీయమని అప్పలకుంట వాసులు తేల్చిచెప్పారు.

ఎప్పుడు తేలుస్తారో..!



- వైసీపీ సిట్టింగుల్లో టిక్కెట్ గుబులు
- కొత్త ఇన్‌చార్జిలకు అసమ్మతి సెగ
- ఐదో జాబితాలో కనిపించని పేర్లు
- ఆరో జాబితా కోసం ఆశావహుల నిరీక్షణ



అనంతపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతోంది. టిక్కెట్ ఉంటుందా..? ఊడుతుందా..? అని వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో గుబులు మొదలైంది. జాబితాలో తమ పేరు కోసం ఎదురు చూస్తూ.. రోజులు లెక్కబెడుతున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఇందు లో పార్లమెంటు స్థానాలకు, పెనుకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, కదిరి, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ప్రకటించా రు. మిగిలిన ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల విషయం తేల్చలేదు. కొత్తగా నియమితులైన ఇన్‌చార్జిలే ఈ ఎన్నికల్లో అభ్యర్థులు అని ఆ పార్టీ చెప్పకనే చెప్పింది. దీంతో ఐదో జాబితాలో తమ పేరు కోసం సిట్టింగ్ ఎమ్మెల్యేలు, పాత ఇన్‌చార్జిలు ఉత్కంఠగా ఎదురు చూశారు. కానీ ఐదు జాబితాలో ఉమ్మడి జిల్లాలో ఒక్కరి పేరూ ప్రకటించలేదు. అతి త్వరలో ఆరో జాబితా విడుదల చేస్తుందని భావిస్తున్నారు. ఆ భారీ జాబితా ఎప్పుడెప్పుడా అని ఉమ్మడి జిల్లా సిట్టింగ్‌లు, ఇన్‌చార్జిలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

సిట్టింగులకు ఫిట్టింగు

వైసీపీ అధిష్టానం ఐదు విడతలుగా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యేను అనంతపురం, కర్ణాటకలోని బళ్లారి మాజీ ఎంపీ శాంతను హిందూపురం పార్లమెంటు అభ్యర్థులుగా ఖరారు చేసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గానికి బదిలీచేసి.. అభ్యర్థులుగా ప్రకటించింది. మడకశిర, కదిరి, శింగనమల, రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చేయి చూపింది. ఆ నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించింది. వారి స్థానంలో.. మడకశిరకు ఈర లక్కప్ప, కదిరికి మక్బూల్ బాషా, శింగనమలకు వీరాంజనేయులు, రాయదుర్గానికి మెట్టు గోవిందరెడ్డిని ఇన్‌చార్జిలుగా నియమించింది.



నివురుగప్పిన నిప్పు

శింగనమల నియోజకవర్గంలో అసమ్మతి లోలోన బుసలుకొడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి తమ అనుయాయుడికే టిక్కెట్ ఖరారు చేయించుకున్నారు. దీంతో ఆశావాహులు, మరీ ముఖ్యంగా కొందరు ముఖ్య దళిత నేతలు, అధికార పార్టీ సామాజికవర్గం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా... ఆ నియోజకవర్గ ఇన్‌చార్జిని పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కొందరు ముఖ్యులు హాజరుకాలేదు. అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. రానున్న ఎన్నికల్లో అసమ్మతి సెగ అభ్యర్థికి తప్పదని ఆ పార్టీ శ్రేణులే అంటున్నాయి.



చూసుకుందాం..

తమను కాదని, కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో సిట్టింగులు పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే కొందరు ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. ఆ బాటలో రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ముందువరుసలో ఉన్నారు. టికెట్ లేదని మొహం మీదే చెప్పేయడంతో.. తాడేపల్లి ప్యాలెస్‌కు గుడ్ బై చెప్పి వచ్చారు. ఆ క్షణం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా కాకుండా, స్వతంత్ర ఎమ్మెల్యే తరహాలో వ్యవహరిస్తున్నారు. కాపు వ్యాఖ్యలు నియోజకవర్గంలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. 'నా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు ఇచ్చింది. సీఎం జగన్ జేబులో నుంచి ఇవ్వలేదు..' అని తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆయనలో కసి ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెబుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గం వైసీపీలో చీలిక అనివార్యమైంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీ అధినాయకత్వంపై అసమ్మతి రోజురోజుకు పెరిగిపోతోంది. కొత్త ఇన్‌చార్జి మెట్టు గోవిందురెడ్డి శిబిరంలో అలజడి రేగుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసమ్మతి సెగను ఊహించుకుని, మెట్టు శిబిరం ఆందోళన చెందుతోంది.

దూరం దూరంగా..

కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి టిక్కెట్ నిరాకరించారు. దీంతో ఆయన వర్గం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్దారెడ్డితో చర్చలు జరిపేందుకు ప్రయత్నించినా, ఆయన అందుబాటులోకి రాలేదు. దీన్నిబట్టి సిద్ధారెడ్డి వర్గం అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉందని స్పష్టమౌతోంది. ఈ పరిణామాలు తాజా ఇన్‌చార్జిపై తప్పక ప్రభావం చూపుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మడకశిరలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామి అధిష్టానం నిర్ణయంపై తీవ్రస్థాయిలో అసంతృప్తిలో ఉన్నారు. ఆయన వర్గీయులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎటు వెళ్లాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

ఆరుగురిలో ఉత్కంఠ

వైసీపీ అధిష్టానం ఇప్పటి వరకూ ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. మిగిలిన నియోజకవర్గాల్లో.. ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ గుబులు పట్టుకుంది. అనంతపురం అర్బన్, గుంతకల్లు, ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తి, తాడిపత్రి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఐదో జాబితాలో తమ పేరు ఉంటుందని ఉత్కంఠగా ఎదురు చూశారు. కాజీ జిల్లాలో ఏ ఒక్కరి పేరూ అందులో రాలేదు. పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఇప్పటికే తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించినట్లు సమాచారం. మిగిలిన సిట్టింగ్‌లు తాడేపల్లి ప్యాలెస్ నుంచి పిలుపు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పిలుపు వస్తే.. అటు ఇటో తేలిపోతుందని, ఉత్కంఠతకు తెరపడుతుందని సిట్టింగ్‌లు అంటున్నారు. ఐదులో తేలకపోవడంతో ఇక ఆరో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. తాజా పరిస్థితులు సిట్టింగులో కలవరం పుట్టిస్తున్నాయి. ఎన్నికలు దగ్గరపడుతున్నా ఎటూ తేల్చకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి దాకా ప్రకటించని నియోజకవర్గాలకు అధికశాతం అధికార పార్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలే ఉన్నారు. బీసీలకు పట్టున్న జిల్లా కావడంతో ఆ సామాజికవర్గం వారు టిక్కెట్ వస్తుందో రాదోనన్న ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరో జాబితా ఎందరికి వరమౌతుందో.. మరెందరికి నిరాశ మిగిలిస్తుందో వేచి చూడాల్సిందే.

రెవెన్యూలో ఎన్నికల బదిలీలు

- అనంత డీఆర్‌ఓగా రామక్రిష్ణారెడ్డి
- ఉమ్మడి జిల్లాలో 55మంది తహసీల్దార్లకు స్థానచలనం

అనంతపురం టౌన్, జనవరి 31: ఉమ్మడి అనంత జిల్లా రెవెన్యూ శాఖలో ఎన్నికల బదిలీలు భారీగా జరిగాయి. అత్యంత కీలకమైన డీఆర్‌ఓ పోస్టుకు కొత్తవారిని నియమించారు. అనంత డీఆర్‌ఓగా రామక్రిష్ణారెడ్డిని నియమించారు. ఈయన తహసీల్దార్‌గా అనేక మండలాల్లో పనిచేశారు. ప్రస్తుతం కడప జిల్లా నుంచి ఇక్కడికి డీఆర్‌ఓగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌ఓ గాయిత్రీదేవిని విజయవాడ డైరెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఎన్నికల నిబంధనల మేరకు అనంత, సత్యసాయి జిల్లాల్లో ఒకేసారి 55 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. పక్క జిల్లాలైన కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు వా రికి పోస్టింగ్‌లు ఇచ్చారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు విడుదల చేశారు.

● బదిలీ అయిన తహసీల్దార్లు వీరే...

ఉమ్మడి జిల్లానుంచి శ్రీధరమూర్తి, విజయలక్ష్మి, ఉషారాణి, షర్మిల, శేషారెడ్డి, ఈశ్వరమ్మ, రమాదేవి, హరికుమార్, మునివేలు, లక్ష్మీనాయక్, మోహన్‌కుమార్, సుమతి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్‌బాషా, సునీతాబాయి, నాగభూషణం, అనిల్‌కుమార్, ఈరమ్మ, ఓబిలేసు, నవాజ్‌అహ్మద్, విజయకుమారి, బాలక్రిష్ణ, ఫణికుమార్, మారుతి, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, వాణిశ్రీ, శ్రీధర్, ఈశ్వరయ్యశెట్టి, ఎస్‌బీ భాస్కర్, వసంతలత, నాగరాజు, నారాయణస్వామి, నీలకంఠారెడ్డి, వెంకటనారాయణ, అనుపమ, జిలాని, కరుణాకర్, రంగనాయకులు, ఎస్. నాగరాజు, జి.నాగేంద్ర, సయ్యద్ సైఫుద్దీన్, సుబ్బలక్ష్మమ్మ, జి.నాగరాజు, కె.శ్రీధర్, స్వర్ణలత, సురేష్‌కుమార్, అనంతాచారి, సౌజన్యలక్ష్మి హసీనాసుల్తానా, జి.నాగరాజు, మల్లికార్జున, వేణుగోపాల్, జమానుల్లాఖాన్ బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన తహసీల్దార్లను నియమించారు. ఎన్నికలు ముగిసేవరకు వీరే ఉంటారు. ఆ తర్వాత తిరిగి ఆయా జిల్లాలకు వెళ్లనున్నారు.

బాలల బీమాకు రూ.5 చెల్లించండి: ఏపీసీ

అనంతపురం విద్య, జనవరి 31: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు బాలల బీమా అమలు చేయనున్నట్లు ఏపీసీ వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కూడా జాతీయ బాలల బీమా పథకం అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ పథం కింద ప్రమాదవశాత్తు విద్యార్థి మరణిస్తే.. రూ.25 వేలు, తీవ్ర అంగవైకల్యం పొందితే రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేస్తారన్నారు. అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఫిబ్రవరి 10వ తేదీలోగా ప్రతి విద్యార్థి నుంచి రూ.5 బీమా కోసం వసూలు చేసి... వచ్చే నెల 15వ తేదీలోగా డీడీ ద్వారా అడిషనల్ ప్రాజక్టు కోఆర్డినేటర్, అనంతపురం పేరుపై సమగ్రశిక్ష కార్యాలయంలో అందజే యాలన్నారు.

కేటాయింపులుండేనా..?





- నేడు కేంద్ర బడ్జెట్ ● రైల్వేకి నిధుల కేటాయింపుపైనే అందరి దృష్టి ● పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా..?

గుంతకల్లు, జనవరి31: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రవేశపెడుతున్న కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు ఎలా ఉంటాయో అన్న ఆసక్తి నెలకొని ఉంది. పార్లమెంటు సమావేశాలు బుధవారం ప్రారంభంకాగా, గురువారం బడ్జెట్ సమావేశం జరగనుంది. రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా లేకపోగా, ఈ శాఖ కేటాయింపులు కూడా యూనియన్ బడ్జెట్ లోనే ప్రకటించనున్న నేపథ్యంలో కనీసం ఎన్నికల వేళైనా కొత్త రైళ్లు వచ్చేనా? అనే ఆసక్తి స్థానికంగా నెలకొని ఉంది. అలాగే ఎన్నాళ్ల నుంచో రైల్వే ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్న నూతన పింఛన్ విధానం రద్దు విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యంతర బడ్జెట్టులో ప్రకటిస్తుందేమోనన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

జనాకర్షకమేనా..?

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు కేంద్రం తీపికబురేమైనా అందిస్తుందోమోనన్న ఊహ బడ్జెట్ పై ఆశలు పెంచుతోంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌ను కేవలం నిర్వహణ లక్ష్యంగానే ఇంటీరియం ప్రతిపాదించడం రివా జు. కానీ ఎన్నికల తరుణంలో ఏదైనా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేకపోలేదన్న ఉత్సాహం రైల్వే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ప్రజల్లో నెలకొని ఉంది. రైల్వే ఉద్యోగుల నుంచి పాత పింఛను విధానం పునరుద్ధరణతోపాటు, ఎనిమిదవ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు కూడా డిమాండ్లు ఉన్నాయి. ఏపీఎస్ విషయంపై ఈ నెలాఖరుకు సార్వత్రిక సమ్మె విషయంగా కార్మిక సంఘాల సమావేశం నిర్వహించే విషయంగా కేంద్రానికి నోటీసును కూడా ఇచ్చిన నేపథ్యంలో వాటిపై ప్రకటన విషయంగా సంఘాలు ఎదురుచూస్తున్నాయి. కిందటి సంవత్సరం రైల్వేకు కొత్త ప్రాజెక్టులేవీ ప్రతిపాదించకుండా, కేవలం పెండింగు ప్రాజెక్టులకే కేటాయింపులు చేశారు. వందే భారత్ రైళ్లు కాకుండా డిమాండ్లు ఉన్న రూట్లలో కొత్త రైళ్లేమైనా వస్తాయా? అని ఎదురుచూస్తున్నారు.

ఇన్నేళ్లకైనా మోక్షం కలిగేనా..?

కిందటి సంవత్సరం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు అంటూ హంగామా చేసినా కొన్ని పాత ప్రాజెక్టుల నిర్మాణంలో ఏమాత్రం చలనం ఏర్పడలేదు. గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్డు పనులు ఏళ్లు పూర్తవుతున్నా ఎంతకూ తెమలడం లేదు. ఈ షెడ్ నిర్మాణానికి రూపకల్పన జరిగి 14 ఏళ్లు, పనులు ప్రారంభమై 8 ఏళ్లు అయినా పనులు పూర్తికావడానికి అవసరమైన నిధుల విడుదల జరగడంలేదు. అలాగే గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో తాగు నీటి అవసరాల కోసం నిర్మించతలపెట్టిన అదనపు రైల్వే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు స్తంభించిపోయాయి. నిధులు లేక ఎస్‌ఎస్ ట్యాంకు పనులు ల్యాండ్ లెవెలింగ్ తోనే నిలిచిపోయాయి. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును తాత్సారం చేస్తున్నారు. నీటి సదుపాయం లేనందున ఎన్నో రైళ్లకు గుంతకల్లులో నీటిని నింపకుండా పంపుతున్నారు. రైల్వే కాలనీల్లోని గృహసముదాయాలకు తగిన విధంగా నీటిని అందించలేకపోతున్నారు. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులకు నిధులను ఇచ్చినా పూర్తిచేయలేకపోయారు. కడప-బెంగళూరు మధ్య రూ. 2706 కోట్లతో చేపట్టిన కొత్తలైన్ నిర్మాణం నత్తనడకన నడుస్తోంది. శ్రీకాళహస్తి-నడికుడి లైన్ నిర్మాణానికి రూ. 2289 కోట్లతో మంజూరుచేయగా పనులు కొనసాగుతున్నాయి. గుంతకల్లులో ట్రాక్షన్ షెడ్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. విజయవాడ-గూడూరు మధ్య 3వ లైన్ నిర్మాణానికి 2016-17లో రూ. 3549 కోట్లతోనూ, అకోలా-డోన్ మధ్య కొత్త లైన్‌కు అనుమతులు లభించాయి. నిధులు రావడంలేదు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2-3 ప్లాట్‌ఫారాలను ఇతర ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేసే పనులు చేపట్టాల్సి ఉంది.



గుంతకల్లు రైల్వే స్టేషన్

కరోనా రైళ్లు కదిలేనా..?

కరోనాలో నిలిచి పోయిన రైళ్లను పునఃప్రారంభించే విషయంగా ప్రజల నుంచి డిమాండ్లు మూడేళ్లుగా వస్తున్నాయి. పాత రైళ్ల విషయంగా స్థానికంగా డిమాండ్లు వస్తున్నా, రైల్వే అధికారులు, రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీల నుంచి ప్రతిపాదనలు వెళ్తున్నా ప్రభుత్వంలో చలనం రావడంలేదు. రద్దయిన హుబ్లీ-విజయవాడ, విజయవాడ-యశ్వంతపూర్, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజరు రైళ్లు, కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇప్పటి దాకా పునరుద్ధరించనేలేదు. అలాగే విజయవాడకు వెళ్లేందుకు కొత్త రైళ్లను వేయాలనే విషయంగా చేస్తున్న డిమాండ్లు అరణ్య రోదనగానే మిగులుతున్నాయి. ఇక ప్యాసింజరు రైళ్లకు కరోనా తర్వాత స్పెషల్ ఫేర్ ట్రెయిన్స్ అనే పేరుపెట్టి ప్రయాణికుల నుంచి రైలు టిక్కెట్ల రూపంలో మూడేళ్లుగా అదనపు వసూళ్లు చేస్తున్నారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పెడచెవినపెడుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ లో భారీ రైల్వే ప్రాజెక్టుల విషయంగా పెద్దగా అంచనాలు లేకపోయినా, కనీసం జనాకర్షణ కోసమైనా ఏవైనా ప్రయోజనాలు కలుగుతాయేమోనని వేచి చూస్తున్నారు.

సొంత పార్టీ నేతలకే జగన్ వ్యవహారాలు నచ్చడం లేదు

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



అనంతపురం అర్బన్, జనవరి 31: సొంత పార్టీ నేతలకే జగన్ వ్యవహారాలు నచ్చడం లేదని టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు, సుప్రీం కోర్టులు జగన్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా సీఎంకు బుద్ధిరావడం లేదన్నారు. సుప్రీం కోర్టులో ఇన్నర్ రింగ్ రోడ్డు అంశంపై ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కొట్టివేసిందంటే జగన్ ప్రభుత్వం టీడీపీ ముఖ్యనేతలపై ఎన్ని కుట్రలు చేశారో అర్థం చేసుకోవచ్చునన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను చంద్రబాబు ప్రజల్లో తీసుకువెళుతున్నారన్న అక్కసుతోనే ఆయనపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో ఎలాంటి తప్పు చేయకపోయినా చంద్రబాబును జైలుకు పంపించారని దుయ్యబట్టారు. కోర్టుల్లోనూ న్యాయం జరగడం ఆలస్యం కావొచ్చుగానీ.. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. జగన్ వ్యవహారాలను మౌనంగా భరిస్తూ వచ్చిన వైసీపీ నాయకులు పెదవి విరుస్తూ బయటకు వస్తున్నారన్నారు. కేవలం సీట్లు దక్కలేదన్న కారణమే కాదని, ఇన్నాళ్లు ఇలాంటి పార్టీలో ఉన్నందుకు బాధపడుతున్నారన్నారు. చంద్రబాబు చేపట్టిన రా కదలిరా సభలకు వస్తున్న జనం చూస్తుంటే టీడీపీ విజయం ఎప్పుడో ఖరారైందన్నారు. టీడీపీకి 5 కోట్ల ప్రజలే స్టార్ క్యాంపయినర్లు అన్నారు. అవినీతి, అక్రమాల వైసీపీని ప్రజలంతా ఏకమై ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మహిళలు

పొదుపు సంఘాల సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

గాండ్లపెంట, జనవరి 31: మండలంలోని కటారుపల్లి, గొల్లపల్లి గ్రామాల మహిళా సంఘాల బుక్‌కీపర్ రామాంజులు పొదుపుసంఘాల డబ్బు స్వాహా చేశాడని ఆయా సంఘాల మహిళలు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గొల్లపల్లిలో బుక్‌కీపర్‌గా పని చేస్తున్న రామాంజులు 14 సంఘాల శ్రీనిధి సొమ్ము రూ.12లక్షలకు పైగా స్వాహా చేశారని తెలిపారు. ఈ విషయంపై వెలుగు, ఐకేపీ కార్యాల యం నుంచి డబ్బులు చెల్లించాలని, తమ సంఘాలకు నోటీలు వచ్చాయన్నారు. బుక్‌కీపర్ రామాంజులను విచారణ చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. మహిళలు మున్నీ, రమణమ్మ, గంగాదేవి, గంగోజమ్మ, రేహనాతోపాటు దాదాపు వందమంది మహిళలు పాల్గొన్నారు.

తాళిబొట్టు, కమ్మలు లాక్కెళ్లిన దుండగులు

లేపాక్షి, జనవరి 31 : పశువులను మేపడానికి వెళ్లిన మహిళ మెడలో గుర్తుతెలియని దుండగులు కమ్మలు, తాళిబొట్టు లాక్కెళ్లిన సంఘటన బుధవారం మండల పరిధిలోని లక్కేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దన్నగారి గంగరాజమ్మ తన పశువులను మేపడానికి లక్కేపల్లి చెరువుకు వెళ్లింది. ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి ఆమె చెవిలో కమ్మలు, తాళిబొట్టు లాక్కెళ్లారు. పెనుగులాటలో రెండు చెవులు తెగిపోయాయి. బాధితురాలిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏఆర్ ఏఎస్పీ హనుమంతు బదిలీ

అనంతపురం క్రైం, జనవరి 31 : జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు బదిలీ అయ్యారు. ఈయనను గుంటూరు ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో తిరుపతి ఏఆర్ ఏఎస్పీగా విధుల్లో ఉన్న ఎస్‌ఎల్‌ఎన్ రెడ్డిని నియమించారు.

గొర్రెల మందపైకి దూసుకొచ్చిన లారీ

- ఇద్దరు కాపరులు, 20 జీవాల మృతి

డీ.హీరేహాళ్, జనవరి 31: గొర్రెల మందపైకి లారీ దూసుకురావడంతో ఇద్దరు కాపరులు మృత్యువాత పడ్డారు. 20 గొర్రెలు సైతం మృత్యువాత పడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో కర్ణాటక సండూరు తాలూకా లక్కలపల్లి గ్రామానికి చెందిన కాపరులు మేత కోసం గొర్రెలను తీసుకుని వచ్చారు. మండలం లోని నాగలాపుర గ్రామానికి రాత్రి సమయంలోనే బయలుదేరారు. బళ్లారి - బెంగళూరు హైవే జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో రోడ్డును దాటుతుండగా బళ్లారి నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో ఆ గొర్రెల మందలో ఉన్న రుద్రప్ప(21), గోపాల్(18)పై కూడా లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రుద్రప్ప అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎస్‌ఐ రంగడు యాదవ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.



మృతి చెందిన గొర్రెలు

సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం

అనంతపురం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. ఆ మేరకు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2950 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చింది. ఆ కంపెనీ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ వద్ద 1050 మెగావాట్లు, అనంత జిల్లా కనగానపల్లి, రాప్తాడులలో 1050 మెగావాట్లు, డి. హిరేహాల్, బొమ్మనహాల్‌లలో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.12,065 కోట్లు పెట్టుబడిని జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు ద్వారా 3300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనున్నారు. అదే విధంగా సత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లిలో 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆగ్వా గ్రీన్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.4 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురాగా... మంత్రిమండలి ఆమోదించింది. ప్లాంట్ ఏర్పాటుతో 1000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు రెన్యూ విక్రమ్‌శక్తి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు రావడంతో పాటు విండ్‌పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు రూ.3600 కోట్లు పెట్టుబడి ఆ సంస్థ పెట్టనుంది. తద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయి.

గెలుపోటములను సమానంగా చూడాలి: కలెక్టర్


పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి, జనవరి 31: క్రీడాకారులు ఓటమి, గెలుపును సమానంగా స్వీకరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రశాంతి గ్రామ్‌లో గల క్రీడా మైదానంలో బుధవారం ఆయన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. తర్వాత మాట్లాడుతూ.. క్రీడల వలన శరీరక దృఢత్వంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఓడిపోయామని కుంగిపోకూడదన్నారు. విజయం సాధిస్తామనే ధీమాతో ముందడుగు వేయాలని సూచించారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడల్లో బాలికలు, బాలురు పాల్గొన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీవో భాగ్యరేఖ, క్రీడాధికారి ఉదయ్‌భాస్కర్, నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

ధర్మవరం, జనవరి 31: ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ పనిని వేగవంతం చేయాలని సబ్‌రిజిస్ట్రార్ వెంకటరమణరావును కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. పట్టణంలోని పలు కార్యాలయాలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ముందుగా మార్కెట్ యార్డులో గల గోదాములో ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ బాలుర క్రీడామైదానాన్ని పరిశీలించి నియోజకవర్గానికి ఎన్నికల సమయంలో ఎన్నికలసామగ్రిని పంపిణీ చేసేందుకు ఈ క్రీడామైదానం సరిపోతుందా లేదా వివరాలను అధికారుల ద్వారా అడిగితెలుసుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడ సబ్‌రిజిస్ట్రార్‌తో ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్లపై మాట్లాడారు. పనులు త్వరగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేశ్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఈశ్వరయ్య, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఈఓ మీనాక్షి పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, జనవరి 31: 18 ఏళ్ల వయ సు నిండిన వారు ఇంకనూ ఆన్‌లైన్‌లో ఓటరుగా నమో దు చేసుకోవడానికి అవకాశం ఉందని ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. కేంద్ర ఎన్నికల సం ఘం ఆదేశాల మేరకు సవరించిన తుది ఓటరుజాబితాను ఆమె పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తమ ఓటు వివరాలను ఓటర్లు సరిచూసుకోవచ్చన్నారు. మరణించిన వారిపేర్లు, డబుల్ ఎంట్రీలు, వలసవెళ్లిన వారి పేర్లు ఉంటే గుర్తించాలన్నారు. 01-01-2024 నాటికి 18ఏళ్ల వయస్సు నిండిన యువతకు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఏఓ జిలాని, ఈడీటీలు నరసింహులు, మనోజ్‌కుమార్, హరికృష్ణ, రెహమాన్, పలువురు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచార కమిటీ ఏర్పాటు

ధర్మవరం, జనవరి 31: నియోజకవర్గానికి చెందిన టీడీపీ ప్రచార కమిటీని ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మంగళవారం ప్రకటించారు. అదేవిధంగా సోషల్ మీడియా కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కాగా ప్రచార కమిటీలో స్థానం పొందిన భీమనేని ప్రసాదనాయుడు, గుంపు లక్ష్మీపతి, భీమనేని ఉమామహేశ్వచౌదరి బుధవారం కాణిపాకం వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. భీమనేని ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఘన విజయం సాధించాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. ఇప్పటి నుంచి తెలుగుదేశం విజయం కోసం నిరంతరంగా కృషిచేస్తామని పేర్కొన్నారు.

విమర్శలు మాని.. హామీలు నేరవేర్చండి: జనసేన

ఓబుళదేవరచెరువు, జనవరి 31: సీఎం జగన్ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయించడం మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని జనసేన మండలాధ్యక్షుడు మేకల ఈశ్వర్ , ప్రధాన కార్యదర్శి కొండబోయని సతీష్ హితవు పలికారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజమండ్రి వైసీపీ ఎంపీ మార్గాని భరత్ పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఖండించారు. అధికారంలో రాకముందు వైఎస్ జగన్ సీపీఎస్‌ను రద్దు చేస్తామని, రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని, జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి ప్రతిఏటా ఉద్యోగాలు ఇస్తామని హామీలిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయించడం మాని, ఇచ్చిన హామీలు నేరవేర్చాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అర్జ్ శ్రీనివాసులు, కార్యదర్శి సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్‌ను పునరుద్ధరించడం అన్యాయం

కదిరిఅర్బన్, జనవరి 31: ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, ధర్నాలు, నిరాహారదీక్షలు చేస్తే.. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానం రద్దు చేశారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం తిరిగి నియామకాల్లో అప్రెంటీస్ ప్రకటించడం అన్యాయమని, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రామమోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేబినెట్ సమావేశంలో 6,100 ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడానికి ఆమోదించారన్నారు. ఈ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, ఉపాధ్యాయుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండేళ్లపాటు గౌరవ వేతనంతో సర్వీసులు కొసాగించాలంటే బతుకు భారమవుతుందని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణం ప్రచార యాత్ర ప్రారంభం


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్, జనవరి 31: సేవాభారతి కదిరి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో అయోధ్య సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు సేవాభారతి కదిరి శాఖ అధ్యక్షుడు చెన్నరాయశెట్టి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార రథాన్ని బుధవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం 20 రోజులపాటు కదిరి తాలూకాలోని పది మండలాల్లో పర్యటించి ప్రచారం చేస్తుందన్నారు. 21న నిర్వహించే సీతారాముల కల్యాణానికి ప్రముఖ అతిథిగా ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, తిరుమలతిరుపతి దేవస్థానం ఈఓ ధర్మారెడ్డి, చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డితోపాటు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పాల్గొననున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కేశవ, సురేష్, కోటా నాగరాజు, సుబ్బరాజు గుప్తా, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, గుడిసె దేవానంద్, ఉత్తమరెడ్డి, సుదర్శన్, వెంకటేష్, డీఎల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సంచార పశువైద్య సేవలు

- వేధిస్తున్న మందుల కొరత
- పశువులు, జీవాలకు సరిగా అందని వైద్యం
- నీరుగారుతున్న పథకం


సంచార పశువైద్య వాహనం


వాహనంలో అరకొరగా ఉన్న మందులు

కదిరిఅర్బన్, జనవరి 31: సంచార పశువైద్యం కోసం ఏర్పాటు చేసిన ప్రతి వాహనంలో రూ.35వేలు విలువైన 81 రకాల మందులు అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో గొప్పగా ప్రకటించింది. అయితే రానురాను వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం సాధారణ చికిత్సకు అవసరమైన మందులు కూడా అక్కడ ఉండడం లేదు. సంచార పశువైద్యంపై ప్రభుత్వం ప్రచార ఆ ర్భాటం కనిపిస్తోందే తప్పా.. పాడి రైతులకు అవసరమైన సేవలు అందించలేకపోతోంది. మనుషులకే కాదు మూగజీవాలకోసం అంబులెన్సులు తెచ్చాం, ఫోన్ చేస్తే చాలు మీఇంట ముగింటికి పశువైద్యవాహనాలు వచ్చి పశువులు, గొర్రెలు, మేకలకు మెరుగైన వైద్యం అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే క్షేత్రస్థాయిలో ఈపథకాన్ని సక్రమంగా అమలు చేయలేక ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో రెండేళ్లకే వైఎస్ఆర్ సంచార ఆరోగ్య సేవ పథకం నీరుగారింది. మందుల కొరతతో వీటి సేవలు అస్తవ్యస్తంగా మారాయి.

పశువైద్యం కోసం వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్యసేవ పథకం కింద నియోజక వర్గానికి రెండు వాహనాలు కేటాయించారు. వీటిలో ఒక్కో వాహనానికి ఒక పశువైద్యుడు పారావెట్, అటెండర్ కం డ్రైవర్ ఉంటారు. వాహనాలు ప్రభుత్వమే సమకూర్చినా, నిర్వహణ బాధ్యతను జీవీకే, ఈఎంఆర్ సంస్థలకు అప్పగించారు. మొదటలో వాహన సేవలు సక్రమంగా అందినా, తరువాత నుంచి దారితప్పాయి. జీతాలు తక్కువంటూ వైద్యులు చేరినట్లే చేరి.. వెనక్కు వెళ్లిపోయారు. యజమాన్యం హామీ ఇవ్వడంతో మళ్లీ విధుల్లోకి వెళ్లి సేవలు కొనసాగిస్తూ వస్తున్నారు.

మందుల కొరత తీవ్రం..

సంచార వాహనంలో మందుల కొరత వేడిస్తోంది. వాహనం నుంచి మందులు పాడిరైతులకు అందడం లేదు. ఈ వాహనాలకు సరఫరా చేసే మందులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరీ సగం బడ్జెట్‌ను భరిస్తున్నాయి. అయితే కేంద్రం ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రం ఇవ్వలేదని కేంద్రం కొంతకాలంగా మందుల సరఫరా నిలిపివేశాయి. ముఖ్యంగా యాంటీబయాటిక్, మినరల్ మిచ్చర్, డీవార్మింగ్, అరుగుదలకు సంబంధించిన సిరఫ్‌లు అందుబాటులో లేవు. దీంతో కదిరి పట్టణంలోని పశువుల ఆస్పత్రిలో ఉన్న మందులను కొన్నింటిని తీసుకెళ్తున్నారు. రైతులకు కొన్ని మందులు ఇచ్చి, మిగిలిన వాటిని ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. పశువులకు హిస్టారెక్టమీతో సహా పలు శస్త్రచికిత్సలు, 20రకాల పేడ పరీక్షలు, 15రకాల రక్తపరీక్షలు చేసేందుకు వీలుగా 54రకాల పరికరాలు, మినీ ఫ్రిజ్ వాహనంలో అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడి రెండు వాహనాల్లోనూ అలాంటివేవీ లేవు.

మొరాయిస్తున్న అంబులెన్స్‌లు..

ఇక అప్పుడప్పుడు అంబులెన్స్ వాహనాలు కూడా మొరాయిస్తున్నాయి. దీంతో సేవలు నామమాత్రం అయ్యాయి. కొన్ని వాహనాల్లో లిఫ్టులు పనిచేయకపోవడంతో పశువులకు వైద్య పరీక్షలు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కదలలేని స్థితిలో ఉన్న పశువులను లిఫ్టు ద్వారా వాహనంలోకి ఎక్కించి సమీపంలోని పశువైద్యశాలకు తరలించాల్సి ఉంటుంది. వాహ నాల్లో పరికరాలు మరమ్మతులకు గురైతే నెలల తరబడి బాగు చేయడం లేదు. దీంతో అరకొర సేవలతోనే సరిపెడుతున్నారు.

తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్, జనవరి 31: తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా అందరం పనిచేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన గాండ్లపెంట, కనగానిపల్లి, అమడగూరు, ముదిగుబ్బ, ఎనుమలపల్లి, పుట్టపర్తి, దర్శినమల, పెద్దమంతూరు, యస్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందితో మాతృశిశుమరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి 9 సెంటర్లలో ఒక మాతృమరణం, 12 శిశుమరణాలు 12 సంభవించాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యాదినిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేష్, వైద్యురాలు పావని, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, సీడీపీఓ గాయత్రి, సంబంధిత వైద్యాధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయండి: జేసీ

పుట్టపర్తి, జనవరి 31: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన.. సంబంధితాధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి 32 కిలోమీటర్ల దూరానికి 57.77 హెక్టార్ల భూమికిగాను పరిహారం కింద రూ.18.27కోట్లు మంజూరైందన్నారు. బీ.కొత్తకోటనుంచి గోరంట్ల, గోరంట్లనుంచి హిందూపురం, బెంగుళూరు, కడప, విజయవాడ మధ్య రోడ్డుకు భూసేకరణ పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పనులను అలసత్వం ప్రదర్శించకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. నష్టపరిహారాన్ని రైతులకు సకాలంలో అందించాలన్నారు. కోర్టుకేసులకు సంబంధించి పెడింగ్‌లో ఉన్న నిధులను కోర్టులో డిపాజిట్టు చేయాలన్నారు. సమీక్షలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఆర్డీవో భాగ్యరేఖ, వంశీకృష్ణ, ఆయా మండలాల తహసీల్దార్లు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

తనకల్లు, జనవరి 31: మండలంలోని ఈతోడు గ్రామానికి చెందిన మనోహర్ అతడి కుటుంబసభ్యులు చిన్నపిల్లలతో సహా బుధవారం మండలకేంద్రంలోని పో లీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి న్యాయం కావాలంటూ ధర్నా నిర్వహించారు. ఈతోడు దళితవాడకు చెందిన మనోహర్ భార్య తన ప్రియుడు పవన్‌కుమార్‌తో కలిసి ఈనెల 23వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయంపై మనోహర్ తన పిల్లలతో వచ్చి తనకల్లు పోలీసులకు జనవరి 24 తేదీన ఫిర్యాదు చేశాడు. కాగా పోలీసులు పట్టించుకోకపోవడంతో 26న కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లును కలిసి న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయంపై సీఐ స్పందించి కేసు నమోదు చేశారు. సీఐకి చెప్పారన్న కారణంతో స్థానిక పోలీసులు పట్టించుకోలేదని, దీంతో న్యాయం చేయాలని బాధితులు ధర్నా చేపట్టారు. పది రోజులు గడుస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో ధర్నా చేపట్టామన్నారు. సీఐ వెంకటేశ్వర్లు న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నా విరమించారు.

బావిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం


మంజునాథ్ (ఫైల్)

నంబులపూలకుంట, జనవరి 31: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బావిలో శవమై తేలిన ఘటన మండలంలోని బలిజపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బలిజపల్లికి చెందిన శ్రీరాములు, సుందరమ్మకు ఒక కుమార్తెతో పాటు కుమారుడు మంజునాథ్ (21) ఉన్నారు. వారు కొన్నేళ్ల క్రితం మదనపల్లికి వలసవెళ్లి అక్కడే మగ్గం నేస్తూ పిల్లల్ని చదివించారు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటారు. వారు ఇటీవల కుమార్తెకు పెళ్లి చేశారు. బీటెక్ పూర్తిచేసిన మంజునాథ్ మూడునెలల క్రితం బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధుల్లోకి చేరాడు. కాగా అతను మంగళవారం స్వగ్రామమైన బలిజపల్లికి వచ్చాడు. సాయంత్రం స్నేహితులతో, గ్రామస్థులతో కలిసి సరదాగా గడిపాడు. అయితే బుధవారం ఉదయం గ్రామానికి సమీపంలోని ఎర్రమ్మ బావి వద్ద అతడి ఫోన్ మోగుతున్న శబ్దం రావడంతో గొర్రెలకాపర్లు గమనించి పరిశీలించారు. చుట్టుపక్కల గాలించగా.. బావిలో ఆ యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో వారు గ్రామంలో సమాచారం అందించారు. గ్రామస్థులు వెంటనే వచ్చి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు బావిలో నుంచి బయటకు తీయించారు. గురువారం పోస్టుమార్టానికి పంపనున్నట్లు తెలిపారు. మృతికి కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. చేతికొచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో అతడి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

నిప్పంటుకుని చిన్నారికి గాయాలు

ధర్మవరం, జనవరి 31: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డి కాలనీకి చెందిన రామాంజనేయులు, జయమ్మ దంపతుల కుమార్తె కీర్తన బుధవారం సాయంత్రం ఇంటి ముంగిట ఆడుకుంటోంది. జయమ్మ ఇంటి గడప వద్ద దీపం వెలిగించింది. కీర్తన గమనించకుండా ఆడుకుంటూ ఆ దీపం సమీపంలోకి వెళ్లి నిలబడింది. దీంతో చిన్నారి దుస్తులకు నిప్పంటుకుని శరీరమంతా మంటలు వ్యాపించాయి. తల్లిదండ్రులు వెంటనే మంటల్ని ఆర్పి హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చిన్నారికి ప్రాణాపాయం లేదని తెలిసింది.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, జనవరి 31: మండలంలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన లక్ష్మన్న బుధవారం రాత్రి కుటుంబ కలహాలతో విషపుద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకున్న బంధువులు అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే అదే కాలనీకి చెందిన శిరీషా కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కదిరి ఆసుపత్రికి తరలించారు.

స్ప్రింక్లర్ పైపుల చోరీపై ఫిర్యాదు

నల్లమాడ, జనవరి 31: మండలకేంద్రానికి చెందిన రైతు శివారెడ్డి బోరుబావి వద్ద ఉన్న స్ప్రింక్లర్ పైపులు 30, స్ప్రింక్లర్లు 10 మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈమేరకు బాధిత రైతు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెలరోజులక్రితం కూడా తమ బోరు బావి వద్ద స్పింకర్లు, పైపులు ఎత్తుకెళ్లారని ఆయన తెలిపారు.

టౌన్‌ప్లానింగ్‌లో అంతులేని అవినీతి

- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆరోపణలు

కదిరి, జనవరి 31: మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో అంతులేని అవినీతి చోటు చేసుకుందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ హాల్‌లో బుధవారం సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ నజమున్నీసా అధ్యక్షత వహించారు. ఎక్స్‌అఫిషియో మెంబరుగా ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే సాధారణాంశాలతో పాటు, బడ్జెట్‌నుకూడా సభ్యులు ఆమోదించారు. అనంతరం జరిగిన ప్రశ్నత్తోరాల కార్యక్రమంలో 26వార్డు కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ.. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అంతులేని అవినీతి చోటు చేసుకుందన్నారు. టౌన్ ప్లానింగ్‌లోని అధికారులు ఫలానా నెట్ సెంటర్‌కే వెళ్లాలని, సూచించడం శోచనీయమన్నారు. పట్టణంలోని చావిడి ఎదుట ఓ భవనాన్ని రిజర్వు స్థలం ఆక్రమించి కట్టారని, ఇందుకోసం టౌన్‌ప్లానింగ్ అధికారులకు రూ. నాలుగు లక్షలు ముట్టాయని ఆరోపించారు. ఇక్కడ ప్రతి పనికి ఓ రేటుందని దుయ్యబట్టారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారి చంద్రమ్మ మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని, దళితురాలిని కాబట్టే తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. దీనికి కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఉద్యోగంలో జాతి, కుల, మత బేధాలుండవని, అలాంటివాటిని ముందుకు తేవడం సరికాదని అన్నారు. దీనిపై సమగ్రవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. 24వార్డు కౌన్సిలర్ అల్లాముస్తఫా మాట్లాడుతూ.. తన వార్డులో మసీదుకెళ్లడానికి సరైన దారిలేదని, రోడ్డు వేయాలని 15నెలలక్రితమే విన్నవిస్తే.. టెండరు పిలిచారని, అయితే ఇప్పటికీ రోడ్డువేయలేని మండిపడ్డారు. రోడ్డు ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషనర్ శ్రీహరిబాబు స్పందిస్తూ తిరిగి టెండర్లు వేస్తామని, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే మున్సిపాలిటీనే రోడ్డు వేస్తుందని సమాధానమిచ్చారు. చివరగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, ఇళ్లపట్టాలు ఇచ్చామని, రోడ్లు, మురుగునీటి కాలువలు వేశామని చెప్పుకొచ్చారు. ఆయన మాట్లాడుతుండగానే కొంతమంది కౌన్సిలర్లు వెళ్లిపోవడం గమనార్హం.

'పరిటాల రవీంద్ర రుణం తీర్చుకుంటాం'


అనంతపురంలో పరిటాల శ్రీరామ్‌ను కలిసిన పత్రికులస్థులు

ధర్మవరం, జనవరి 31: మాజీమంత్రి దివంగత పరిటాల రవీంద్ర మా కోసం ఎంతో చేశారని, ఆయన రుణం తీర్చుకునే సమయం వచ్చిందని పత్ర కులస్థులు అన్నారు. ముదిగుబ్బ మండలానికి చెందిన పత్ర కులస్థులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ రోజుల్లో తమకు ఏ కష్టం వచ్చినా పరిటాల రవీంద్ర వెంటనే స్పందించేవారన్నారు. ఆయన కుమారుడైన పరిటాల శ్రీరామ్ ధర్మవరానికి రావడంతో రుణం తీర్చుకోవడానికి తమకు అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్న భారీ మెజారిటీతో గెలిపించడానికి తమవంతుగా కృషిచేస్తామని తెలిపారు. టీడీపీ ఎప్పటికీ పత్రకులస్థులకు అండగా ఉంటుందని, ముదిగుబ్బ మండలంలోని టీడీపీ నాయకులతో కలిసి పని చేయాలని శ్రీరామ్ సూచించారని వారు చెప్పారు.

జేసీని కలిసిన జడ్పీ సీఈఓ


జేసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్పీ సీఈఓ

పుట్టపర్తి, జనవరి 31: జిల్లాపరిషత్ సీఈఓ వైకోం విజయాదేవి బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిశారు. ఆమె జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లి జేసీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న సంక్షేమపథకాలు, లక్ష్యాల గురించి చర్చించారు. జిల్లాను అభివృద్ధి పథంలో నిలపెట్టడానికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించాలని వినతి

ముదిగుబ్బ, జనవరి 31: మండల కేంద్రంలోని కస్తూరిబా స్కూల్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి మంజులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఐదేళ్ల క్రితం ఏర్పడిన ఈ కాలనీలో తాగునీరు, విద్యుత్, వీధిలైట్లు, సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సౌకర్యాలు కృపంచాలని కోరారు. సీపీఐ నాయకులు తిప్పయ్య, ఆదినారాయణ, లింగప్ప, శీనా తదితరులు పాల్గొన్నారు.

'కబ్జాలకు గురైన స్థలాలను కొనకండి'

ముదిగుబ్బ, జనవరి 31: మండల కేంద్రంలో కబ్జాకు గురైన డీకేటీ భూములు కొని సామాన్యులు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు సూచించారు. గోనుగుంట్ల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని గుంజేపల్లి రెవెన్యూ పొలాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో, డీకేటీ భూముల్లో కొందరు అధికార పార్టీ నాయకులు, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి అక్రమ లే అవుట్లు వేసి ప్లాట్లు అముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు గమనించి వాటిని కొనుగోలు చేయరాదన్నారు. ఎవరైనే కొంటే మోసానికి గురవుతారని చెప్పారు. మండలంలో అక్రమ లేఅవుట్లపై మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, బాలభాస్కర్, ల్యాబ్ నారాయణస్వామి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన

ధర్మవరంరూరల్, జనవరి31: మండలంలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం కుష్ఠువ్యాధిపై దర్శినమల ఆరోగ్యకేంద్ర సీహెచ్‌ఓ కళావతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠు సోకితే శరీరంపై స్పర్శలేని మచ్చలు , ఎరుపురంగుతో కూడి ఉబ్బినట్టుగా ఉన్న మచ్చలు ఏర్పడతాయన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగానందరెడ్డి, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐకి సన్మానం

బుక్కపట్నం, జనవరి 31: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ నరసింహుడు పట్నం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇందుకు గాను బుధవారం స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఆయనను సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు బాలు, సయ్యద్, జయరాం, శ్రీరాములు, అబ్దుల్‌వాజీద్, కేశవనాయుడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సీఐటీయూ

ఓబుళదేవరచెరువు, జనవరి 31: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు డిమాండ్ చేశారు. ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరుతూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన కార్మికులు చేపట్టిన రిలేదీక్ష బుధవారం నాటికి రెండో రోజుకు చేరింది. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టప్ప, కేశప్ప, శ్రీనివాసులు, విజయ్, మహేంద్ర, ప్రసాద్, గంగాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రామప్పనాయుడి మృతికి పల్లె నివాళి

ఓబుళదేవరచెరువు, జనవరి 31: టీడీపీ సీనియర్ నాయకుడు, మండల తొలి ఎంపీపీ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోయపాటి రామప్పనాయుడు మృతికి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నివాళులర్పించారు. అనారోగ్యంతో రామప్పనాయుడు మృతిచెందగా.. అతని స్వగ్రామమైన మండలంలోని నాయనవారిపల్లిలో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలకు మాజీమంత్రి పల్లె హాజరై నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, ఏడీసీసీ మాజీ చైర్మన్ సరిపూటి సూర్యనారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు నివాళులర్పించారు.

ఈ-పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలి

తనకల్లు, జనవరి 31: మండలంలో ఈపంటనమోదును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సిబ్బందికి సూచించారు. మండలంలోని తవళం, గేమేనాయక్‌తండా, ముండ్లవారిపల్లి, కొక్కంటి, కొండవెనుకపల్లి గ్రామాల పొలాల్లో జరుగుతున్న ఈపంట నమోదును బుధవారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. రైతులందరికి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. 2023-24కు సంబంధించి ఈపంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏఓ శ్రీహరినాయక్, ముండ్లపల్లి సర్పంచ్ మునేనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కొత్తచెరువు, జనవరి 31: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని చైతన్య పాఠశాలలో బుధవారం క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏజీఎం ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కల్గిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలను నిర్వహిచి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఓ కేశవరెడ్డి, డీన్ హనుమంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ రజతోత్సవ పోస్టర్ల విడుదల

నల్లమాడ, జనవరి 31: మండలంలోని దొన్నికోట ఉన్నత పాఠశాల ఆవరణలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రజతోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆ ఫెడరేషన్ రాష్ట్రనాయకుడు షర్ఫొద్దీన్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం బుధవారం విడుదల చేశారు. డీటీఎఫ్ రజతోత్సవాలను ఈనెల 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు బయ్యప్పరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణ, సిద్దయ్య గంగాధర్ తదితరులు ఉన్నారు.

టీడీపీ శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయండి : గుండుమల

మడకశిరటౌన్, జనవరి 31: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గంలో గురువారం జరిగే ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఐదు మండల కేంద్రాల్లో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మడకశిరలో పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే రొళ్ల మండల కేంద్రంలోని లక్ష్మీప్యాలెస్, అగళి మండల కేంద్రంలో సినిమా థియేటర్ వద్ద, అమరాపురం మండల కేంద్రంలో జిల్లా కార్యదర్శి ఇంటి ఆవరణంలో, గుడిబండ మండల కేంద్రంలో శివకుమార్ ఇంటి ఆవరణంలో ఉదయం 10 గంటలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికారత సారథులందరూ తప్పక హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుడిబండ: మండల కేంద్రంలో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 4న నృత్య ప్రదర్శన

టీడీపీ నాయకులు

లేపాక్షి, జనవరి 31 : స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 4వతేదీన సాయంత్రం 6గంటలకు లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ప్రాంగణం వద్ద నృత్యప్రదర్శన నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జయప్ప తెలిపారు. టీడీపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేపాక్షి ఆలయ కీర్తిని ప్రపంచానికి చాటిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలవల్ల లేపాక్షి కీర్తి నలుమూలలా వ్యాపించిందన్నారు. లేపాక్షి గురించి అప్పుడు తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల ఆలయాన్ని సందర్శించారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, రాష్ట్ర ఈడిగ సాధికార కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్, షెక్షావలి, బుల్లెట్ రవి, మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు పర్యావరణ విద్యపై పరీక్షలు

పెనుకొండ, జనవరి 31: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు, గత సంవత్సరం పరీక్షలకు హాజరుకాని విద్యార్థులకు శుక్రవారం నుంచి నైతిక విలువలు, పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్ర, శని వారాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు.

హక్కులను కాపాడుకోవాలి

తహసీల్దార్

రొద్దం, జనవరి 31: ప్రతి పౌరుడు తమ హక్కులను కాపాడుకోవాలని తహసీల్దార్ అనంతచారి పేర్కొన్నారు. రొద్దంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించిరు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పౌర హక్కులపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పౌరహక్కులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హక్కు అనేది రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రధాన మైన నియమ నిబంధన అన్నారు. కార్యక్రమంలో జమేదార్ నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడికి అస్వస్థత

గోరంట్ల, జనవరి 31: మండలంలోని పాలసముద్రం గ్రామంలో నీటి కుంటలో పడిన రెండేళ్ల బాలుడు సంతోష్ బుధవారం అస్వస్థతకు లోనయ్యాడు. పాలసముద్రానికి చెందిన నరసింహులు కుమారుడు రెండేళ్ల చిన్నారి ఇంటి ఎదుట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కొళాయి నీటి గుంతలో పడ్డాడు. కొంతసేపటికే బంధువులు గుర్తించి బాలుడిని వెలికి తీసి, గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయంగా ఉండడంతో 108 వాహనంలో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

హిందూపురం, జనవరి 31 : పట్టణంలోని బాలసదన్‌లో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయవాది సుదర్శన్, లోక్ అదాలత్ సిబ్బంది శారద, న్యాయవాది సంతోష్‌కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవరచు కోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి చదవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలసదన్ పర్యవేక్షణ అధికారి రహమత్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థం నమిలి ఆవుకు గాయాలు

పెనుకొండ రూరల్, జనవరి 31 : మండలంలోని హరిపురం గ్రామంలో వ్యవసాయ పొలాల్లో నల్లక్క అనే మహిళ పాడి ఆవులను మేపేందుకు సమీప అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్లింది. గ్రాసం తింటున్న ఆవు నోటిలో ఒక్కసారిగా డిటోనేటర్ (పేలుడుపదార్థం) పేలడంతో ఆవుకు దవడ పూర్తిగా పగిలిపోయింది. ఆ శబ్దానికి చుట్టుపక్కల మేత మేస్తున్న ఆవులు పరుగులు తీశాయి. గమనించిన స్థానికులు తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆవుకు వైద్య పరీక్షలు అందించారు. రోజూ ఉదయం మూడు లీటర్లు, సాయంత్రం మూడు లీటర్లు పాలిచ్చే ఆవు ఇలా ప్రమాదం బారినపడటంతో ఆందోళన వ్యక్తం చేశారు.

నిప్పంటుకుని చిన్నారికి గాయాలు

ధర్మవరం, జనవరి 31: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో ఓ చిన్నారి ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డి కాలనీకి చెందిన రామాంజనేయులు, జయమ్మ దంపతుల కుమార్తె కీర్తన బుధవారం సాయంత్రం ఇంటి ముంగిట ఆడుకుంటోంది. అయితే జయమ్మ ఇంటి గడప వద్ద దీపం వెలిగించింది. కీర్తన గమనించకుండా ఆడుకుంటూ ఆ దీపం సమీపంలోకి వెళ్లి నిలబడింది. దీంతో చిన్నారి దుస్తులకు నిప్పంటుకుని శరీరమంతా మంటలు వ్యాపించాయి. తల్లిదండ్రులు వెంటనే మంటల్ని ఆర్పి హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

జగన్‌ను సాగనంపేందుకు జనం సిద్ధం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత




టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, జనవరి 31 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఎద్దేవ చేశారు. పట్టణంలోని అన్న క్యాంటిన్‌లో ఆమె బుధవారం టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నేతలు అంటున్నారని, వారినే ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలు అంటున్నారన్నారు. ఏ గల్లీకి పోయినా ఇదేమాట వినిపిస్తోందన్నారు. ఇక ఈ ప్రభుత్వానికి 75రోజులు మాత్రమే గడువుఉందని, వైసీపీ దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. ఇన్నేళ్లలో జగన్‌రెడ్డి ప్రజల్లోకి వచ్చిన పాపానపోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో 'సిద్ధం' అనే నినాదంతో బహిరంగసభలు నిర్వహించి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. వైసీపీ అరాచకపాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ఉద్యోగులు అంతా సిద్దమయ్యారని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల తరు వాత వైసీపీ జెండా కనుమరగవ్వడం ఖాయమన్నారు. ఇక యుద్ధం మొదలైం దని అందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసిన పార్టీ వైసీపీ అన్నారు. అలాంటి పార్టీ ప్రజలకు అవసరం లేదని, ఈ ధర్మయుద్ధంలో టీడీపీ - జనసేన కూటమి గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత యువత దేనని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువత రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను, అరాచకాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మంజునాథ్, వాసుదేవరెడ్డి, రమణమ్మ, సోము, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వర్సెస్ వైస్ చైర్మన్





ఒకే వర్గంలో రెండు గ్రూపులు

చెడ్డపేరు తెచ్చేందుకే కౌన్సిల్‌లో గొడవ అంటూ ఆరోపణ

3 నుంచి పురంలో మంత్రి పర్యటన

హిందూపురం, జనవరి 31: అధికార పార్టీలో హిందూపురానికి సంబందించి ఒకేవర్గంలో రెండు గ్రూపులుగా విడిపోయినట్లు ఇటీవల జరుగుతున్న పరిణామాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ప్రస్తుత సమన్వయకర్త దీపికకు, ఆమె హిందూపురానికి రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికార పార్టీకి చెందిన నాయకులకు మధ్య అగాదం పెరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డికి, సమన్వయకర్త దీపిక, ఆమె భర్తకు మధ్య వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు మునిసిపల్ కమిషనర్ బదిలీ వెనుక వైస్ చైర్మన్ బలరాంరెడ్డి పాత్ర ఉందని సమన్వయకర్త వర్గం గట్టిగా నమ్ముతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంగళవారం కౌన్సిల్ సమావేశంలో గొడవ జరగడానికి కారణం ఆ ప్రజాప్రతినిదే అంటూ సమన్వయకర్త వర్గీయులు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉంటే మొన్నటి వరకు సమన్వయకర్త దీపిక వర్గంలోనే వైస్ చైర్మన్ ఉండేవారు. కానీ సమన్వయర్త వద్ద ఉన్న కొంతమంది కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు వైస్ చైర్మన్‌ను తరచూ వ్యతిరేకిస్తూ వచ్చారు. దీంతో మూడు నెలలుగా సమన్వయకర్తకు వైస్ చైర్మన్‌కి మధ్య విభేదాలు ఎత్తి చూపుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వైస్ చైర్మన్ ఏ పని చెప్పినా సమన్వయకర్త భర్త వ్యతిరేకించడంతోపాటు ఆ ప్రజాప్రతినిధి ఏమి చెప్పినా తనకు తెలియకుండా చేయకూడదంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల ఓ చిన్న పని విషయంలో... ఇన్‌చార్జ్ చెబితేనే చేస్తానని వైస్ చైర్మన్‌కు కమిషనర్ చెప్పేశాడు. దీంతో అప్పటి నుంచి వైస్ చైర్మన్‌తోపాటు కొంతమంది కౌన్సిలర్లు సమన్వయకర్తకు దూరమైనట్లు తెలిసింది. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా రూ. కోట్లు ఖర్చుపెట్టించారని, అయినా చైర్మన్ స్థానగానీ, పార్టీలో గౌరవం లేదని వైస్‌చైర్మన్ తన సన్నిహితులవద్ద వాపోయి నట్లు సమాచారం. దీంతో ఒకే వర్గంలో ఉన్నవారు రెండు గ్రూపులుగా విడిపోయారు.

విడిపోయి నిలదీతలు: వైసీపీ హిందూపురం పాలకవర్గం విడిపోయి మూడేళ్లవుతోంది. ఈ పరిస్థితుల్లో మొదటి 1, 2 కౌన్సిల్ సమావేశాలు సజావుగా జరిగాయి. ఆ తరువాత కౌన్సిల్‌లో ఓవర్గం ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు వ్యతిరేకంగా పనిచేస్తూ వచ్చింది. ఆయన్ను పంపించాక కొన్ని నెలలకు ఎమ్మెల్సీ సమన్వయకర్త వర్గాలు ఏకతాటిపైకి వచ్చినట్లు కనిపించారు. అయినా మరోసారి మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధిపై ఆ పార్టీ కౌన్సిలర్లే నిలదీసిన ఘటనబట్టి వర్గాలు మరీ పుంజుకుంటున్నాయని అర్థం అవుతుంది. పార్టీకి చెడ్డపేరు తెచ్చేందుకు వారిలి ప్రవర్తించారని సమన్వయకర్త వర్గీయులు ఆరోపిస్తున్నారు.

3న పురంలో మంత్రి పర్యటన : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నెల 3న హిందూపురంలో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల ఆయన మండలాల్లో పంచాయతీలవారీగా సమావేశాలు నిర్వహించారు. అదేరీతిలో పట్టణంలో వార్డులవారీగా సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. పట్టణంలో మంత్రి పర్యటన సందర్భంగా పట్టణంలోని ఆ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు ఎలా వ్యవహరిస్తారోనని ఆ పార్టీలో చర్చ మొదలైంది.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

రొద్దం, జనవరి 31: పుట్టపర్తిలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో కలిపి గ్రామ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. పుట్టపర్తిలో బుధవారం ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన ఖోఖో పోటీల్లో రొద్దం మండలం కలిపి గ్రామ పంచాయతీ విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబరచినందుకు జిల్లాస్థాయి అధికారులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రొద్దం నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, మండలస్థాయి అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

మారని చేనేతల తలరాతలు

చేనేత సంఘం నాయకులు - మహాసభ పోస్టర్ల విడుదల

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జనవరి 31: ప్రభుత్వాలు మారుతున్నా చేనేత వృత్తిని నమ్ముకుని ఉన్న వారి తలరాతలు మారలేదని చేనేత కార్మిక సంఘం మండల నాయకులు బాలస్వామి తదితరులు పేర్కొ న్నారు. ఫిబ్రవరి 9న సోమందేపల్లిలో జరిగే చేనేత మహాసభలను జయప్రదం చేయాలంటూ వారు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చేనేత వృత్తిపై ఆధారపడి సోమందేపల్లి మండల వ్యాప్తంగా ఆరు వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. పెట్టుబడికి తగ్గ గిట్టుబాటు ధర లేక చేనేతలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని వాపోయారు. ఎలాంటి ష్యూరిటీ లేకుండా ఒక్కో చేనేత కుటుంబానికి రూ.2లక్షలు రుణాలు, 45సంవత్సరాలు దాటిన చేనేత కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే 11రకాల చేనేత రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న ప్రతి ఒక్క చేనేత కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. చేనేతలకు 200యూనిట్లదాకా ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.25కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, రవీంద్ర పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న చేనేత నాయకులు

రేపు మడకశిరలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

మడకశిరటౌన్, జనవరి 31: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మడకశిర నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్నట్లు వైసీపీ మడకశిర సమన్వయ కర్త ఈరలక్కప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అగళి మండలంలో, 11.30 గంటలకు రొళ్ల, 12.30కు గుడిబండ, 3 గంటలకు అమరాపురం, సాయంత్రం 4.30 గంటలకు మడకశిరలో మంత్రి పర్యటిస్తారని తెలిపారు. కావున నియోజకవర్గంలో అన్ని మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పంచాయతీలకు నిధుల విడుదల

పెనుకొండ రూరల్, జనవరి 31 : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం పీఎఫ్‌ఎంఎస్ ద్వారా 15వ ఫైనాన్స్ నిధులు విడుదలైనట్లు ఈఓఆర్డీ శ్రీదేవి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పెనుకొండ మండలంలోని పది పంచాయతీలకుగాను 2022-23కు సంబంధించి రూ.63,75,000 నిధులు మంజూరయ్యాయి. అడదాకులపల్లి పంచాయతీకి 3,4 విడతల కింద రూ.3,29,791, దుద్దేబండకు రూ.7,56,406, యర్రమంచి రూ. 4,07,999, గోనిపేట రూ.3,36,435, గుట్టూరు రూ.7,44,580, మావటూరు పంచాయతీకి 5,21,294 మంజూరయ్యాయి. అలాగే మునిమడుగు రూ.8,78,016, నాగలూరు రూ.4,87,684, రాంపురం రూ. 8,04,228, శెట్టిపల్లి రూ.6,43,780, వెంకటగిరిపాళ్యం పంచాయతీకి రూ.3,93,327 మంజూరయ్యాయి. వీటిని గ్రామంలోని తాగునీరు, డ్రైనేజీ నిర్వహణ, కరెంటు బిల్లులకు వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. నిధులు మంజూరు కావడంతో సర్పంచులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు పురంలో జయహో బీసీ సదస్సు

హిందూపురం, జనవరి 31 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం హిందూపురంలో జయహోబీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షులు రమేష్, హిందూపురం రూరల్ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జయహోబీసీ కార్యక్రమానికి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో బీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. 9గంటలకు ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ నివాసం వద్దనుంచి ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి అక్కడి నుంచి ఆర్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు.

భజన కళాకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

పెనుకొండ రూరల్, జనవరి 31: పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం భజన కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శంకరప్ప తెలిపారు. మండలంలోని నాగలూరు, బండ్లపల్లి, కురుబవాండ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన చెక్కభజన, తాళంభజన, కోలాటం, జెక్కి ఆడే 45మంది కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. వీటితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు పొందవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

సమయానికి ఉపయోగపడని '108'

ఆలస్యంగా వస్తున్న సంఘటనలు అనేకం

ఇబ్బందులు పడుతున్న బాధితులు



హిందూపురం అర్బన్, జనవరి 31: ఆపదలో ఉన్న వారు 108కు కాల్ చేస్తే నిమిషాల వ్యవ ధిలో రయ్...రయ్ అంటూ వాహనం మీ ముంగిట వాలిపోతుందంటూ నాయకులు, అధికారులు చెబుతూనే ఉన్నారు. ప్రమాదాల బారిన పడిన వారిని, అత్యవసర సేవలు అవసరమైన వారిని నిమిషాల్లో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడుటలో 108 ముందు వరుసలో ఉందంటున్నారు. కానీ చాలా సమయాల్లో ఆ మాటలకు ఏ మాత్రం విలువ లేకుండా పోతోంది. అత్యవసర సమయాల్లో 108 వాహనం కోసం ఫోన్ చేసి, ఎంత సేపటికీ రాకపోవడం తో విసుగెత్తిపోయి ఆటోల్లోనో, ప్రైవేట్ వాహనాల్లోనో ఆసుపత్రికి చేరిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మూడు రోజుల కిందట అంటే ఈ నెల 28వ తేదీన రాత్రి హిందూపురంలోని నానెప్ప నగర్‌కు చెందిన హార్ట్ పేషెంట్‌కు ఉన్న ఫలంగా ఛాతీలో నొప్పి మొదలైంది. కుటుంబసభ్యులు 108కు కాల్ చేశారు. అయితే హిందూపురం వాహనం రెఫర్ ఉండటంతో దూర ప్రాంతానికి వెళ్లిందని, సమీప మండలం లేపాక్షి వాహనాన్ని కనెక్ట్ చేస్తామన్నారని రోగి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే ఆలస్యమైతే రోగి తట్టుకోలేడని, మరింత ఆలస్యమైతే ప్రాణాలకే ముప్పువాటిల్ల వచ్చని అతడని ఆటోలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 108 అయితే ప్రథమ చికిత్స అందిస్తారని ఆశించి కాల్ చేశామన్నారు. తీరా తాము ఆసుపత్రికి చేరుకే సమయానికి ఒక 108 వచ్చిందన్నారు. ఇదిలాఉండగా హిందూపురం 108 వాహనాన్ని పార్కింగ్ చేసే ప్రాంతంలో మరో 108 వాహనం ఉందని బాధితులు పేర్కొన్నారు. అందుబాటులో ఉండి కూడా వాహనాలు అందుబాటులో లేవని ఎందుకు చెప్పారని ఆగ్రహించారు. సమయానికి ప్రజలకు ఉపయోగ పడకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు చాలానే ఉన్నాయి.

పురం ఆసుపత్రికి ఒకే వాహనమా?

ప్రభుత్వం మండలానికి ఒక 108 వాహనం కేటాయించింది. ఆ మేరకు అనంతపురం ఆసుపత్రి తరువాత అంతటి స్థానం కలిగిన హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా హిందూపురం మండలానికి ఒకే వాహనం ఉంది. పురం ప్రభుత్వాసుపత్రి నుంచి నిత్యం ఏదో ఒక కేసు అనంతపురానికి రెఫర్ చేస్తుంటారు. అలాంటపుడు వారు ఒక్క సారి పేషంట్‌ను అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి రావాలంటే కనీసం 5 నుంచి 6 గంటల సమయం పడుతుంది. ఈ సమయంలో మరి కొంత మంది రెఫర్ అయితే వారి పరిస్థితి ఘోరం. వారు వేలకు వేలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

జిల్లాలో 108 వాహనాలు 32 ఉన్నాయి. అత్యవసర సమయాల్లో ఎక్కడైనా 108 వాహనం మరమ్మతులకు గురైనా, మరి ఏ ఇతర కారణాల వల్ల అయినా ఆగిపోతే బ్యాక్‌అప్ కోసం మరో రెండు వాహనాలు ఉన్నాయి. మాకు సమాచారం అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో చేరుకుని ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నాము. వైద్యులు ఎక్కడకు రెఫర్ చేస్తే అక్కడకు పేషంట్‌లను తీసుకుపోవాల్సిన డ్యూటీ మాది. ప్రతి సిబ్బంది నాణ్యమైన సేవలు అందిస్తున్నారు.

- సంజీవరెడ్డి, 108 మేనేజర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించండి

అధికారులకు జేసీ అభిషేక్ కుమార్ ఆదేశం



సెక్టోరియల్ అధికారులకు సూచనలిస్తున్న జేసీ

హిందూపురం అర్బన్, జనవరి 31: స్థానిక అసెంబ్లీ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించాలని సెక్టోరియల్ అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. ఆయన బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ ఓటర్లకు అనుకూలంగా ఉండాలనే వాటిపైన అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడి సురేష్, లేపాక్షి తహసీల్దార్ బాబు, చిలమత్తూరు తహసీల్దార్ నాగరాజు, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు

పెనుకొండ, జనవరి 31: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు కోరారు. మునిసిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో చర్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నవిధంగా ఉన్నాయన్నారు. ఏపీజీఎల్ఐ రుణాలు, పదవీవిరమణ చెల్లింపుల్లో పను జరుగడంలేదన్నారు. సరెండర్‌లీవ్, ఐఆర్ ప్రకటన, నెలవారి పదోన్నతుల చేపట్టకపోవడం పాఠశాల విద్యారంగానికి గొడ్డలిపెట్టు అన్నారు. జీఓ 117 రద్దు, ఓపీఎస్ అమలు, ఎయిడెడ్ పాఠశాలల సమస్యలు తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



పెనుకొండలో మాట్లాడుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

పెనుకొండ, జనవరి 31 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక శిబిరం బుధవారంతో ముగిసింది. రాయల వేసవి విడిది గగన్మహల్‌వద్ద ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ప్రిన్సి పాల్ కేశవరావు, పురావస్తుశాఖ ఏడీ రజిత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి హాజరై ప్రసంగించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రంగనాయకులు, అధ్యాపకులు శ్రీదేవి, యశోదరాణి, చెన్నారెడ్డి, ప్రతాప్, కాంతారావు, మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో వారం రోజులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుభ్రత పనులు చేపట్టారు. చివరిరోజు బుధవారం గ్రామంలోని పాఠశాల సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, హెచ్‌ఎం యశోదమ్మ, ఉపాధ్యాయులు రాధిక, కౌన్సిలర్ మారుతి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: గ్రామాలు అభివృద్ధి చెందితేనే ఆ దేశం అభివృద్ధి చెందినట్లని బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప పేర్కొన్నారు. పరిగి మండల పరిధిలోని శాసనకోటలో బుధవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి, కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, తెలుగు ఉపన్యాసకులు లక్ష్మీనారాయణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పావగడ ఎమ్మెల్యే వెంకటేష్



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ, జనవరి 31: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, అవి మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ పేర్కొన్నారు. తాలూకా పరిధిలోని దొడ్డహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం షెటిల్‌కాక్, త్రోబాల్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడా రు. ఉపాధి హామీ పథకం కింద చిక్కహళ్లి పంచాయతీలోని పాఠశాల అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో నరేగా పనులను ఎంతో అందంగా తీర్చిదిద్దారని ఆయన ప్రశంసించారు. విద్యార్థులకు క్రీడలతో ఎంతో ఆనందం, ఉత్సాహం కలిగిస్తామన్నారు. పాఠశాలలోని క్రీడామైదానాన్ని నరేగా పథకం కింద ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం వరద ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ జానకిరాం, తహసీల్దార్ వరదరాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటి ప్రవాహం



రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తున్న మురుగునీరు

మడకశిరటౌన్, జనవరి 31: మడకశిర పట్టణంలోని పెనుకొండ రహదారికి ఆనుకొని కాలనీలకు వెళ్లే రహదారిలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నీటికి దారెటు అన్న ప్రశ్న తలెత్తుతోంది. సమీపంలోనే ఓ పాఠశాల ఉంది. దీంతో ప్రతినిత్యం వందలాది మంది విద్యార్థులు ఆ నీటిలోనే నడుచు కుంటూ వెళ్లే పరిస్థితి నెలకొంది. దాదాపు 300 కుటుంబాలు అక్కడ నివసిస్తున్నాయి. ఆ రహదారిపై వెళ్లే వారందరూ ఆ మురుగు నీటిలోనే నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి నెలకొంది. 15 రోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకునే వారు లేరు. కనీసం మున్సిపల్ అధికారులు అటువైపు చూడడంలేదని, ప్రజా ప్రతినిధులు పట్టించుకో వడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ మురుగునీటిని దారిమళ్లించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.